సాక్షి
నారాయణపేట
బుధవారం, 10, మే, 2023



మెరిసిన గురుకులం

ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని మైనార్టీ గురుకులాల విద్యార్థులు ప్రతిభ చాటారు.

వివరాలు 8లో ▸



భారీ చోరీ

మహబూబ్‌నగర్‌లోని పాత పాలమూరులో మంగళవారం భారీ చోరీ జరిగింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /27.4

వాతావరణం

రోజంతా ఎండ ప్రభావం ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై, వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రౌడీల కదలికలపై నిఘా పెట్టాలి



నారాయణపేట: రౌడీలు, కేడీల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని పోలీసు అధికారులకు డీఎస్పీ కె.సత్యనారాయణ సూచించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో పెండింగ్ కేసులపై ఫంక్షనల్ వర్టికల్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసులపై సీఐలను, ఎస్‌ఐలను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేసు నమోదు నుంచి చార్జీషీట్ వరకు ప్రతి విషయాన్ని పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్, ప్లాన్ ఆఫ్‌యాక్షన్, ఎస్‌టీపీని వివరించారు. కేసుల్లో శిక్షల శాతం పెంచాలని, గంజాయి, గుట్కా, పేకాటపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలన్నారు. పోక్సో , ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వేస్టిగేషన పూర్తి చేసి 60రోజుల్లో కోర్టులో చార్జీసీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్ స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించుకోవాలని చెప్పారు. విధి నిర్వహణలో రోల్ క్లారిటీ, గోల్ క్లారిటీ ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐలు సీతయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రవిబాబు, ఎస్‌ఐలు సురేష్, పర్వతాలు, నరేశ్, శ్రీనివాసులు, నరేందర్, విక్రమ్, విజయ్‌భాస్కర్, హరిప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను అరికడదాం



నారాయణపేట టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిరంలో జరుగుతున్న పది రోజుల శిబిరంలో విద్యార్థులు వినూత్న ఆలోచనతో ముందుకెళ్తున్నారు. పర్యావరణ హితమే లక్ష్యంగా ప్లాస్టిక్ బాటిల్‌లో ప్లాస్టిక్‌ను బంధించే కార్యానికి శ్రీకారం చుట్టారు. ఇంట్లో వాడే అనేక రకాల వస్తువుల ప్లాస్టిక్ కాగితాలను ఎక్కడ పడితే అక్కడ పడేయడం వల్ల పశువులు తిని ప్రాణాలు కోల్పోతున్నాయని గ్రహించి, ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ ప్లాస్టిక్ బాటిల్‌లో బంధించం వల్ల పశువులకు, పర్యావరణానికి మేలుచేసిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర నాయకులు బాలరాజ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నరసింహ, సురేష్‌కుమార్, భాస్కర్ రెడ్డి, కిషోర్ కుమార్, కుర్మయ్య పాల్గొన్నారు.

'పీఆర్సీ ప్రకారం కనీస వేతనం ఇవ్వాలి'

నారాయణపేట టౌన్: గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు కనీసం వేతనం రూ.19వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పంచాయతీ కార్మికులకు కేవలం రూ.వెయ్యి పెంచి అవమానపరిచారని విమర్శించారు. 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.19వేలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని అన్నారు. గ్రామ పంచాయతీ సమస్యల కోసం దశలవారీగా ఆందోళనకు జేఏసీ ప్రణళిక సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జోషి, నరసింహ, రామచంద్ర, మున్నా నాయక్ ఉన్నారు.

బాలికల హవా

ఇంటర్ ఫలితాల్లో అట్టడుగున పేట

- ఫస్ట్ ఇయర్‌లో 34వ స్థానం
- సెకండ్ ఇయర్‌లో 32వ స్థానంతో సరి
- ఒకేషనల్‌లో జిల్లాకు మొదటి స్థానం



కె.నాగహర్ష



సాధియా ముస్కాన్



సాయికుమార్

నారాయణపేట: తెలంగాణ ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా బాలికల ఉత్తీర్ణత శాతం పెరిగింది. మంగళవారం విడుదలైన ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా ఫస్ట్ ఇయర్‌లో 34వ స్థానం, సెకండ్ ఇయర్‌లో 32వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 37 జూనియర్ కళాశాలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో 4,088 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 1,712 మంది (41శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్‌లో 3,337 మంది పరీక్ష రాశారు. 1,942 మంది (58శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో మొదటి సంవత్సరంలో 559 మంది పరీక్షలు రాశారు. 413 పాసై 73శాతం, ద్వితీయ సంవత్సరంలో 570 మంది పరీక్షలు రాయగా 485 మంది ఉత్తీర్ణులు కావడంతో 85 శాతంతో మొదటి స్థానంలో నిలిచారు. ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాల్లో బాలికలే అధిక శాతంలో ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ ప్రైవేట్‌లో బాలురు 3,447 మంది పరీక్ష రాశారు. 605 మంది ఉత్తీర్ణులు కావడంతో 17శాతం, బాలికలు 1,464 పరీక్షలు రాయగా 340మంది (23శాతం) పాసయ్యారు. మొత్తం 4,911మంది పరీక్షలు రాయగా, 945 మంది (19శాతం) ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ సెకండ్ ఇయర్ ప్రైవేట్‌లో ఒకేఒక్కరు పరీక్ష రాసి ఉత్తీర్ణులయ్యారు. వందశాతం ఫలితం వచ్చింది.

మైనార్టీ గురుకుల విజయభేరి..

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. సెకండ్ ఇయర్‌లో ఎంపీసీలో పి.సాయికుమార్ 980 మార్కులు, బైపీసీలో ఎండి షరీఫ్ 972 మార్కులు సాధించారు. అదేవిధంగా 18 మంది విద్యార్థులు 900 పైగా మార్కులతో ఉత్తీర్ణులు కావడంతో వంద శాతం ఫలితాలు సాధించినట్లయ్యింది. అలాగే ఫస్ట్ ఇయర్‌లో బైపీసీలో ఎండి ఇలియాజ్ 440మార్కులకు గాను 430 మార్కులు, ఎంపీసీలో పి.ఆసీఫ్ 470 మార్కులకు గాను 438 సాధించారు. 10మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు పొందారు. జిల్లా ప్రభుత్వ, కేజీబీవీ కళాశాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.

జిల్లాలో ఫలితాలు ఇలా..

	ఫస్ట్ ఇయర్ జనరల్			సెకండ్ ఇయర్		
	రాసింది	పాసైంది	శాతం	రాసింది	పాసైంది	శాతం
బాలురు	1874	560	29	1505	720	47
బాలికలు	2214	1152	52	1,832	1,222	66
	ఒకేషనల్ ఫస్ట్ ఇయర్			సెకండ్ ఇయర్		
	రాసింది	పాసైంది	శాతం	రాసింది	పాసైంది	శాతం
బాలురు	190	104	54	180	123	68
బాలికలు	369	309	83	390	362	92



పులిమామిడిలో వందశాతం ఉత్తీర్ణత

ఊట్కూర్: మండలంలోని కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు మంగళవారం ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో గాయత్రి 961 మార్కులతో కళాశాల టాపర్‌గా, సీఈసీలో మాధవి 934 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో సీఈసీలో 30మంది విద్యార్థులకు గాను 30మంది, ఎంపీహెచ్‌డబ్ల్యూ 34 మంది విద్యార్థులకుగాను 34 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం సీఈసీ 28మంది విద్యార్థులకు గాను 27మంది, ఎంపీహెచ్‌డబ్ల్యూ 39మందికి గాను 39 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూలో శాహిన్ అనే విద్యార్థిని 500మార్కులకు 485 సాధించి ప్రథమ స్థానంలో, సీఈసీలో పౌర్ణమి అనే విద్యార్థిని 500 మార్కులకు 457 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. కళాశాలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.



గాయత్రి (961)



మాధవి (934)

ప్రైవేట్ కళాశాలల్లో సైతం ప్రభంజనం..

నారాయణపేట జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో సైతం ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఎంపీసీ విభాగంలో శ్రీసాయి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని కె.నాగహర్ష 1000 మార్కులకు గాను 990 సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా బైపీసీలో సైతం సాధియా ముస్కాన్ 979 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ఎంఈసీ విభాగంలో శ్రేయ సరోడే 960 మార్కులు సాధించారు.

ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

- ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష
- వానాకాలం పంటలకు ఎరువులు సిద్ధం చేయాలి
- జిల్లాలో రీడింగ్ రూమ్‌లు సిద్ధం చేయండి

నారాయణపేట: ఆయిల్‌పాం సాగుకు రైతులను ప్రోత్సహించి జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో ఆయిల్‌పాం సాగు, వానాకాలం పంటలకు ఎరువులు సమకూర్చడం, రైతుబీమా తదితర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఏడువేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ ఉద్యానశాఖ అధికారులు లక్ష్యాన్ని సాధించే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో 1.25లక్షల ఆయిల్‌పాం మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. వానాకాలం పంటలకు జిల్లాకు కావలసిన ఎరువులు సిద్ధంగా ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రైతుబీమా అమలు త్వరగా చేపట్టాలన్నారు. సమావేశంలో లోకల్ బాడీస్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, డీఏఓ జాన్‌సుధాకర్, జిల్లా ఉద్యాన అధికారి సాయిబాబా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రీడింగ్ రూమ్‌లను సిద్ధం చేయాలి

ఈ నెలాఖరు నాటికి రీడింగ్ రూమ్‌లను సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రీడింగ్ రూమ్‌ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 12 ప్రాంతాల్లో రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయడానికి అవసరమైన సదుపాయాలకు నిధులు సమకూరుస్తామన్నారు. రీడింగ్ రూమ్‌లలో చదువుకునే విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్లు, అవసరమైన పుస్తకాలు ఉండేలా చూడాలన్నారు. రీడింగ్ గదులలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, ఫర్నీచర్ సమకూర్చాలన్నారు. ఈనెల 31 నాటికి అన్ని రీడింగ్ గదులు పనిచేసే విధంగా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, డీపీఓ మురళి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందిపెట్టొద్దు

మరికల్: వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలంలో మంగళవారం కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. పస్పుల స్టేజీ సమీపంలో ఉన్న ధాన్యం నిల్వ చేసే మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో తేమశాతంతో పాటు తాలు చూడాలని అన్నారు. తాలు ఎక్కువగా తీస్తే ఊరుకోబోమని అన్నారు. ప్రభుత్వ నింబంధనల మేరకు కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాల పట్టికలను పరిశీలించారు. అనంతరం కొత్తగా నిర్మిస్తున్న మండల సముదాయ భవన, కస్తుర్బాగాంధీ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ రెండు భవనాల పనులు వేగవంతంగా పూర్తి చేసి ఆగస్టు 15వ తేదీలోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. తిరిగి వెళ్తూ పీహెచ్‌సీ ఆస్పత్రి, గురుకుల పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాయంక్ మిట్టల్, తహసీల్దార్ రాంకోటి, డిప్యూటీ ఈఈ నరేందర్, ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవర్లకు మెకానిజంపై అవగాహన ఉండాలి

నారాయణపేట: పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లు అందరూ వాహనాల మెకానిజంపై అవగాహన కలిగి ఉండాని అడిషనల్ ఎస్పీ కె.నాగేంద్రుడు సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఈ–లెర్నింగ్ డ్రైవింగ్ సెంటర్‌లో జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు మెకానిక్ ఆరిఫ్ చేత ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లో పోలీస్ వాహనం డ్రైవర్లు తప్పకుండా వాహనాల మెకానిజంపై అవగాహన కలిగి ఉండాలని, వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల రక్షణ, భద్రత కోసం నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ముందస్తు నేరాలు జరగకుండా చూడాలని, సైరన్ వేసుకుంటూ పెట్రోలింగ్ నిర్వహించాలని, వాహనాన్ని నిర్మానుష్య ప్రాంతాలలో, జనసామర్థ్యం గల ప్రదేశాల్లో విజిబుల్ పోలీసింగ్ విధులు నిర్వర్తించాలన్నారు. వాహనానికి ఏదైనా సమస్య వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, తమకు కేటాయించిన వాహనాన్ని ప్రతిరోజు శుభ్రపరుస్తూ కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. మత్తు పదార్థాలు తాగి నడపరాదని హెచ్చరించారు. జీపీఎస్ ద్వారా తమ వాహనాలు ఏప టైంలో ఏ రూట్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారో ప్రాజెక్టర్ ద్వారా వెహికల్ రూట్ మ్యాప్‌ను చూపించి, వాహనాలను 30 నిమిషాలకు కంటే ఎక్కువగా ఆపరాదని నిరంతరం పెట్రోలింగ్ విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు డేవిడ్ విజయ్‌కుమార్, క్రిష్ణయ్య, జిల్లాలోని మోటార్ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేంద్రుడు

'మిషన్ కాకతీయ' పనుల పరిశీలన



ఊట్కూరు పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఊట్కూర్: ఊట్కూరు పెద్ద చెరువు వద్ద మంగళవారం మిషన్‌కాకతీయ పనులను ఐబీఈఈ బ్రహ్మానందం పరిశీలించారు. చెరువు కట్ట, అలుగు, పాటు కాల్వలకు గతంలో మిషన్‌కాకతీయ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పలుచోట్ల మధ్యలో పనులు వదిలేశారని ఆ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. గతంలో పనిచేసిన కాంట్రాక్టర్‌లతో మాట్లాడి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, లేనిపక్షంలో వారి కాంట్రాక్ట్ రద్దు చేసి ఇతరులకు పనులు అప్పగించి పూర్తి చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'జాబ్‌చార్ట్ ప్రకారమే విధులు నిర్వహిస్తాం'

నారాయణపేట: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు అందరూ జాబ్‌చార్ట్ ప్రకారమే నిర్వహిస్తామని పేర్కొంటూ వీఆర్‌ఏల సంఘం నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పే స్కేల్ అమలు చేయాలని, 55 సంవత్సరాలు పైబడ్డ వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, సీఎం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని పేర్కొన్నారు. ఆంజనేయులు గౌడ్, వెంకటేశ్, సాయిరాం తదితరులు ఉన్నారు.


ప్రతి ఇంటికి ఇంకుడుగుంత తప్పనిసరి



లంకాల్‌లో పర్యటిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

నర్వ: గ్రామాల్లో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకోవాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. మంగళవారం మండలంలోని లంకాల్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. ప్రతి మురుగునీటి కాల్వకు చివరన ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో ప్రజలకు ఇంకుడుగుంత నిర్మాణాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నీటిబొట్టు ఇంకే విధంగా చర్యలు చేపడితేనే భవిష్యత్‌లో భూగర్భజలాలు పెరిగి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని చెప్పారు. మండలంలో మొత్తం 19 గ్రామాలను అధికారులు ఒక్కొక్కరు 5గ్రామాల చొప్పున విభజించుకుని ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఏఈ మారెప్ప, సర్పంచ్ ఉమారాయిరెడ్డి, కార్యదర్శి రాజబాబు, వార్డు సభ్యులు నర్సింహసాగర్ ఉన్నారు.

పనులు ముమ్మరం చేయండి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కోస్గి: మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రెండు నెలల్లో ప్రభుత్వాస్పత్రి పనులు పూర్తి చేసి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. పట్టణంలో రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా తొందరగా పూర్తి చేయాలని సూచించారు. వివాదాస్పదంగా మారిన పాతర్లగడ్డ ఆంజనేయ స్వామి ఆలయ రోడ్డును పరిశీలించి గతంలో ఉన్న మాదిరిగానే రోడ్డు నిర్మాణ పనులు చేయాలని సూచించారు. పాలబావి స్థలంలో నిర్మించే పార్కుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఇందులో కౌన్సిలర్లు మాస్టర్ శ్రీను, బాలేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, పలువురు ఉన్నారు.

అతివేగం.. తీసింది ప్రాణం

- డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం
- అక్క, తమ్ముడితోపాటు మేనత్త దుర్మరణం
- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో ఘటన



భూత్పూర్‌లో వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

భూత్పూర్: అతివేగం ముగ్గురు ప్రాణాలను బలితీసుకొంది. అక్క, మేనత్తతో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరిన ఓ యువకుడు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. భూత్పూర్‌కు చెందిన గడ్డమీది ఆనంద్(22), అక్క నాగమణి(26), మేనత్త లక్ష్మమ్మ(60) పని నిమిత్తం అమిస్తాపూర్ వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై భూత్పూర్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో భూత్పూర్‌లోని ఉన్నత పాఠశాల ఎదుట అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం రోడ్డు మలుపు వద్ద అదుపు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆనంద్, నాగమ్మ, లక్ష్మమ్మ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోనే ఉండటంతో వెంటనే వైద్యాధికారి అబ్దుల్‌రబ్, సీహెచ్‌ఓ రామయ్య అక్కడికి చేరుకుని పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం పోలీసులు మృతదేహాలను మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

భూత్పూర్‌లో విషాదఛాయలు

పట్టణానికి చెందిన గడ్డమీది చెన్నమ్మ, గడ్డమీది శంకరయ్యకు ఇద్దరు కుమార్తెలు కాగా.. పెద్ద కుమార్తె నాగమణిని మహబూబ్‌నగర్ మండలం గాజులపేటకు చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. అయితే నాగమణి ఏడాది క్రితమే భర్తతో విడాకులు తీసుకోగా.. తన మూడేళ్ల కుమారుడితో కలిసి భూత్పూర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. రెండో కూతురు పుష్ప సైతం మూడు నెలల క్రితమే మృతిచెందింది. ప్రస్తుతం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్క, తమ్ముడు మృతిచెందడంతో శంకరయ్య సంతానంలో ఒక్కరు కూడా మిగలలేదు. శంకరయ్య అక్క లక్ష్మమ్మ స్వగ్రామం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని చౌదర్‌పల్లి. లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మమ్మ భర్త సైతం మృతిచెందాడు.



లక్ష్మమ్మ (ఫైల్)



ఆనంద్ (ఫైల్)

మీ ప్రాణాలు మీ చేతుల్లోనే..: ఎస్పీ

మీ ప్రాణాలు మీ చేతుల్లోనే ఉన్నాయని ఎస్పీ నరసింహ అన్నారు. ప్రమాదం జరిగిన స్థలాన్ని మంగళవారం సాయంత్రం డీఎస్పీ మహేష్, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డితో కలిసి ఎస్పీ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు, కారణాలను ఎస్‌ఐ వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపేవారు హెల్మెంట్ ధరించాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపిస్తామని, గ్రామాలు, పట్టణాల్లో వాహనాలను వీలైనంత నెమ్మదిగా నడిపించాలని కోరారు.



క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాముడు (ఫైల్)

గట్టు: మండలంలోని ఆరగిద్దకి చెందిన రైతు బేరింగ్ రాముడు (45) వ్యవసాయ పొలం వద్ద సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సంఘటనకు సంబంధించి గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బేరింగ్ రాముడు తన పొలంలో పత్తి విత్తనాలు నాటుకున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో భోజనం ముగించుకుని పొలానికి వెళ్లాడు. అర్ధరాత్రి పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లను సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకోకపోవడంతో అనుమానంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయాన్ని గుర్తించారు. మృతునికి భార్య తాయమ్మతో పాటుగా ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చేపల వేటకువెళ్లి చెంచు యువకుడు మృతి

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న అప్పాపూర్‌పెంటకు చెందిన తోకల హేమాద్రి(26) చేపల వేటకు వెళ్లి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. హేమాద్రి సోమవారం కృష్ణానది తీరం వెంట పుట్టీలో చేపల వేటకు వెళ్లగా పుట్టీ మునిగి గల్లంతయ్యాడు. యువకుడు ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు వెతకగా నదిలో శవమై కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ యువకుడు..


పవన్‌కుమార్ (ఫైల్)

ఊర్కొండ: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని రేవల్లికి చెందిన పవన్‌కుమార్(21) ఏడాది క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

శవం ఆచూకీ లభ్యం


చాంద్‌పాషా(ఫైల్)

ఆత్మకూర్: మండలంలోని ఖానాపూర్ శివారులో లభ్యమైన గుర్తుతెలియని శవం ఆచూకీ తెలిసిందని ఏఎస్ఐ బీచుపల్లి తెలిపారు. నారాయణపేట జిల్లా ఉట్కూర్‌కు చెందిన చాంద్‌పాషా(60) వారంరోజుల క్రితం కొత్తకోటలో నివశిస్తున్న తన కుమారుడు యూసుఫ్ దగ్గరికి వచ్చాడు. ఆ తర్వాత శుక్రవారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన చాంద్‌పాషా ఖానాపూర్ శివారులో శవమై కనిపించాడు. ఈ క్రమంలో వాట్సాప్ గ్రూపుల్లో ఈ విషయాన్ని ప్రచారం చేయడంతో కుమారుడు గుర్తుపట్టి పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం..



కోయిల్‌కొండ: మండలంలోని కాస్లబండతండా శివారులో గుర్తుతెలియని వ్యక్తి(60) మృతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ సతీష్ తెలిపారు. ఎవరైన సంబంధిత బంధువులు గుర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆటోను ఢీ కొట్టిన లారీ

కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టు సమీపంలో మంగళవారం సాయంత్రం 7గంటలకు ఓ లారీ ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రాయచూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై కృష్ణా ఎస్ఐ విజయభాస్కర్‌ను వివరణ కోరగా ప్రమాదంలో గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించామని, వారి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

ఆరేళ్లు జైలుశిక్ష.. రూ.60వేల జరిమానా

దామరగిద్ద: రైతు పొలానికి వేసుకున్న విద్యుత్ కంచెకు తగిలి ఓ వ్యక్తి మృతిచెందిన కేసులో నిందితుడిగా పేర్కొన్న రైతు కంచెరి హన్మంతుకు జిల్లా సెషన్‌జడ్జి తీర్పునిస్తూ ఆరేళ్ల జైలు శిక్ష, రూ.60వేల జరిమానా విధించారని ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. 2020 సంవత్సరం అక్టోబర్‌లో రైతు కంచెరి హన్మంతు పొలానికి వేసిన విద్యుత్ కంచెకు తగిలి, కతలప్ప మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు కాగా, మంగళవారం జిల్లా సెషన్ జడ్జీ ఎండీ. రఫీ తుది తీర్పునిస్తు శిక్ష విధించారని తెలిపారు.

మైనార్టీ గురుకులాల్లో మెరుగైన ఫలితాలు


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రవినాయక్

- మహబూబ్‌నగర్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన రెండు గురుకులాలు
- నారాయణపేట బాలుర-1లో ప్రథమ, ద్వితీయంలో 100 శాతం ఉత్తీర్ణత

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 10 జూనియర్, నారాయణపేటలోని రెండు జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 86.4 శాతం, ద్వితీయ సంవత్సరంలో 93.19 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయంలో మహబూబ్‌నగర్ బాలికల జూనియర్ కళాశాల-1, మహబూబ్‌నగర్ ఒకేషనల్ ఎంఎల్‌టీ, సీఎస్ కళాశాలలు 100 శాతం సాధించాయి. నారాయణపేట బాలుర-1 కళాశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయంలో 100 శాతం ఉత్తీర్ణతను సాధించం విశేషం. రెండు జిల్లాలోని 12 కళాశాలల్లో ఇంటర్ ప్రథమంలో 558 మంది విద్యార్థుల్లో 482 మంది, ద్వితీయంలో 529 మంది విద్యార్థులకు 493 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. బాలికల కళాశాల-1 ద్వితీయం బీపీసీలో సుప్రియ 985, సబిత 981 మార్కులు, ఎంపీసీలో ఆఫ్రిన్ 983, సమ్రీన్ 981, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో జాహ్నవి 467, నందిని 463, బాలుర-1లో ఎంపీసీ ద్వితీయంలో అన్వరుల్ హక్ 985 మార్కులు సాధించారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

ఉత్తమ ఫలితాలు సాధించిన మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులను మంగళవారం జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి టైటస్‌పాల్, ఆర్ఎల్‌సీ ఖాజా బావుద్దీన్, ప్రిన్సిపాల్ అస్మా ఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఇంజనీరింగ్ చేస్తా..



నేను 6వ తగతి నుంచి మైనార్టీ గురుకులంలో చదువుతున్న. ద్వితీయంలో 985 మార్కులు రావడం సంతోషంగా ఉంది. గురుకుల ఉపాధ్యాయులు ఎంతో చక్కగా బోధించారు, స్టడీ అవర్స్‌లో రెగ్యూలర్‌గా రివిజన్ చేయడం వల్ల మంచి మార్కులు వచ్చాయి. బీటెక్ ఇంజనీరింగ్ చేస్తా.

– అన్వరుల్ హక్, బాలుర-1, మహబూబ్‌నగర్

గురుకులాల్లో ఉత్తీర్ణత వివరాలు

కళాశాల	ప్రథమ	ద్వితీయం
మహబూబ్‌నగగర్ బాలుర-1	81.4	90.7
మహబూబ్‌నగగర్ బాలుర-2	70.3	79.3
మహబూబ్‌నగగర్ బాలుర-3 (ఒకేషనల్ ఎంఎల్‌టీ, సీఎస్)	95.1	97.1
మహబూబ్‌నగగర్ బాలికల-1	93.8	100
మహబూబ్‌నగగర్ బాలికల-2 (ఒకేషనల్ ఏటీ, సీజీటీ)	96.8	100
మహబూబ్‌నగగర్ బాలికల-3	95.7	94.9
జడ్చర్ల బాలుర-1	76	94.3
జడ్చర్ల బాలికల-1	89.1	94.2
దేవరకద్ర బాలుర-1	57.9	86.7
దేవరకద్ర బాలుర-2	86.8	82.9
నారాయణపేట బాలుర-1	100	100
మక్తల్ బాలికల-1	86.4	92.2

నంచర్ల గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణత


మనీషా, (బైపీసీ 981)


గీత ఫస్టియర్, (ఎంపీసీ 461)


కృష్ణవేణి, (ఎంపీసీ 975)


శిరీష, (బైపీసీ 974)

గండేడ్/మహమ్మదాబాద్: ఇంటర్ ఫలితాల్లో మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల గురుకుల పాఠశాలలో 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 74 మంది విద్యార్థులకు 74 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో మనీష బైపీసీలో 981 మార్కులు సాధించింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 78మంది విద్యార్థులు ఉండగా వారిలో 77మంది విద్యార్థులు పాసయ్యారు. 98 శాతం ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ వెంకటమ్మ తెలిపారు. ఎంపీసీలో గీత 461 మార్కులు సాధించింది. గండేడ్ మండలంలోని వెన్నాచేడ్ మాడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 93 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కృష్ణవేణి ఎంపీసీలో 975, ఆర్. శిరీష బైపీసీలో 974 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరంలో 99 మందికి గాను 68 మంది పాసయ్యారు. విశ్వభారతి కళాశాలలో ముస్కాన్‌బేగం బైపీసీలో 960 మార్కులు పొందగా, ఫస్టియర్ ఎంపీసీలో సురేష్ 428మార్కులు సాధించాడు. మహమ్మదాబాద్ కేజీబీవీలో 53 విద్యార్థులకు గాను ఆరుగురు ఫెయిల్ అయ్యారు.

నకిలీ బంగారం విక్రయ ముఠా పట్టివేత

- వలపన్ని పట్టుకున్న బాధితులు
- పోలీసుల అదుపులో నిందితులు


నకిలీ బంగారం బిస్కెట్

జడ్చర్ల: నకిలీ బంగారాన్ని విక్రయించిన ముఠా సభ్యులను మోసపోయిన బాధితులే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గుట్టుగా వలపన్ని పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు.. జడ్చర్ల మండలం నెక్కొండ గ్రామానికి చెందిన బాలస్వామి రెండు నెలల కిందట ఓ మహిళ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతను తన దగ్గర బంగారు బిస్కెట్‌లు ఉన్నాయని, తక్కువ ధరకు ఇస్తానంటూ నమ్మబలికాడు. తన దగ్గర ఉన్న బిస్కెట్ బంగారం ముక్కను కట్ చేసి చెక్ చేయగా ఒరిజినల్ బంగారంగా తేలడంతో నమ్మిన కొనుగోలుదారుడు రూ.2లక్షలు ఇచ్చి 500గ్రాములు బంగారు బిస్కెట్‌లు తీసుకున్నాడు. ఇటీవల కొద్ది రోజుల క్రితం అనుమానంతో తన దగ్గర ఉన్న బిస్కెట్‌ను అవుసలి దుకాణంలో పరీక్షించగా నకిలీదని తేలింది. ఇనుప ముక్కకు బంగారు కోటింగ్ వేసి దానిపై అసలు బంగారు బిస్కెట్‌కు తీసిపోని విధంగా ముద్రణ ఉన్నట్లు గుర్తించారు. దీంతో తనకు నకిలీ బంగారు బిస్కెట్‌లు అంటగట్టిన వ్యక్తికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. ఎలాగైన నకిలీ బంగారం అమ్మిన వారిని పట్టుకోవాలని, అనుమానం రాకుండా తనమిత్రుల సహకారాన్ని తీసుకున్నాడు. తన మిత్రుడి ఫోన్ ద్వారా నకిలీ బంగారం అమ్మిన వ్యక్తికి ఫోన్ చేసి తమకు బంగారు బిస్కెట్‌లు కావాలని అడిగారు. బ్యాంకు ఖాతాలో డబ్బులు జమచేయాలని అడగడంతో, కొంత డబ్బును ఖాతాలో జమ చేశారు. మిగతా సొమ్ము బంగారు ఇచ్చే సమయంలో ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం రెండు రోజుల కిందట బంగారు తీసుకుని మిగతా బ్యాలెన్స్ ఇచ్చేందుకు కల్వకుర్తిలో కలుద్దామని నిర్ణయించుకున్నారు. నకిలీ బంగారంతో కల్వకుర్తికి వచ్చిన ముఠా సభ్యులను బాధితులు పట్టుకున్నారు. రాజాపూర్ పరిధిలోని ఓ మామిడి తోటలోకి తీసుకువచ్చి చితకబాదారు. దీంతో దెబ్బలు తాళలేక వారి నుంచి తప్పించుకున్న ఓ వ్యక్తి 100కు డయల్ చేశాడు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. జడ్చర్ల రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిందితులను విచారిస్తున్నట్లు సీఐ జములప్ప తెలిపారు.

చెరువులో పసికందు మృతదేహం

- పందులు పీక్కుతిన్న వైనం

మరికల్: ఏ తల్లి కన్నబిడ్డనో.. అప్పుడే పుట్టిన ఆ పసికందు కన్నురెప్పలు కూడా తెరకముందే కాటికి పంపించిన ఘటన సోమవారం అర్ధరాత్రి మరికల్ కనకల్ చెరువులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తుతెలియని తల్లి ప్రసవించిన బిడ్డను చంపేసి మరికల్ శివారులో ఉన్న కనకల్ చెరువులో రహస్యంగా గుంత తవ్వి పాతి పెట్టేందుకు ప్రయత్నించింది. అయితే సమీపంలో మనుషుల అలికిడిని గమనించిన వారు పసికందు మృతదేహాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో రాత్రి సమయంలో పందులు, కుక్కలు శరీరాన్ని పీక్కుతిన్నాయి. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులకు పందులు పీక్కుతిన్న పసికందు మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పసికందు మృతదేహాన్ని నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నాగులకుంటలో విష ప్రయోగం

- పెద్ద ఎత్తున ఒడ్డుకొచ్చిన చేపలు



బల్మూర్: మండలంలోని కొండనాగుల గ్రామ సమీపంలోని నాగులకుంటలో చేపలపై విషప్రయోగం చేశారు. కుంటలో ఉన్న చేపలన్నీ మంగళవారం ఉదయం తేలి ఉండటాన్ని గమనించిన మత్స్యకారులు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఉద్దేశపూర్వకంగానే కుంటలో విషం చల్లడంతో చేపలన్నీ మృతి చెందాయని మత్స్యకారులు వాపోయారు. కుంటలో అక్కడక్కడ విషం చల్లిన ఆనవాలు ఉన్నట్లు గ్రామస్తులు తహసీల్దార్ కిష్ట్యానాయక్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుంట వద్దకు చేరుకున్న తహసీల్దార్, ఎంపీడీఓ దేవన్న, సర్పంచ్ రేవతి పరిసరాలను పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఈవిషయమై కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కుంటలో మృతి చెందిన చేపల విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని మత్స్యకారులు వాపోయారు.

బాలుడి అనుమానాస్పద మృతి


ఆనంద్ (ఫైల్)

అమరచింత: వ్యవసాయ పొలం వద్ద ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. అమరచింతకు చెందిన తోకలి చిన్న భీమన్న, రాములమ్మలకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిన కుమారుడు ఆనంద్(17) ఇంటికి రాత్రి వరకు తిరిగిరాలేదు. ఎక్కడో పనుల కోసం వెళ్లి ఉంటాడని తల్లిదండ్రులు భావించారు. అయితే మంగళవారం పొలం పనులకు వెళ్లిన వారితోపాటు ఆనంద్ స్నేహితులకు ఉరివేసుకుని మృతిచెందినట్లు కనిపించాడు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా.. వారు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు. ఆనంద్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అప్పుడప్పు డీజే డెకరేషన్ పనుల కోసం వెళ్తుండేవాడు. ఆనంద్ శరీరంపై కనిపిస్తున్న గాయాలను చూసి.. ఉరివేసుకొని చనిపోలేదని, ఎవరో కొట్టి చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తండ్రి చిన్న భీమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర నాయుడు తెలిపారు.

ప్రేమ వ్యవహారమే కారణమా..?

ఆనంద్ పట్టణానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నాడని తెలిసి అమ్మాయి కుటుంబ సభ్యులు మందలించి వదిలిపెట్టారని సమాచారం. ఈ క్రమంలోనే రెండు నెలల క్రితం పట్టణంలోని బాలికల పాఠశాల ఆవరణలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌పైకి అర్ధరాత్రి సమయంలో ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో పోలీసులు కాపాడారు. తాజాగా బాలుడి అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం గమనార్హం.

ఉద్యోగం రాక.. మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం


సురేష్‌బాబు(ఫైల్)

మానవపాడు: ఉద్యోగం కోల్పోయి రెండు నెలలైనా మరో ఉద్యోగం దొరకకపోవడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మేడ్చల్ మల్కాజిగిరి గాజుల రామారం ప్రాంతానికి చెందిన ఏవూరు సురేష్ బాబు(40) హోటల్ అసిస్టెంట్ మేనేజర్‌గా 13ఏళ్లుగా విధులు నిర్వహించాడు. రెండు నెలల క్రితం ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఇతర ఉద్యోగాల కోసం ప్రయత్నించినా లాభం లేకపోయింది. దీంతో మనస్తాపం చెందిన ఆయన సోమవారం ఉదయం కారులో బయలుదేరి వచ్చి ఇటిక్యాల, మానవపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో నారాయణపురం శివారుప్రాంతంలో రాత్రి గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కారు ఎక్కడ ఉందో తెలియదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నాని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సారా తయారీ స్థావరాలపై దాడి


నర్సాయపల్లిలో బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న సీఐ, ఎస్ఐలు

బల్మూర్: సారా తయారీ స్థావరాలపై మంగళవారం పోలీసులు, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నర్సాయపల్లి, అంబగిరి, కొండనాగులలో మెరుపు దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3వేల లీటర్ల బెల్లం పానకం, సామగ్రి ధ్వంసం చేశారు. సారా స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు నాగర్‌కర్నూల్ డీటీఎఫ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ శివానంధంగౌడ్, డీటీఎఫ్ ఎస్ఐ అరుణ, లింగాల ఎస్ఐ శ్రీనివాసులు, ఎక్సైజ్ ఎస్ఐ సతీష్‌కుమార్, ఏఎస్ఐ రేణయ్య, సిబ్బంది ఉన్నారు.

వాగులో తవ్విన గుంతలు పూడ్చాలి


బాధితులతో కలిసి రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

- ఇసుక అక్రమ తవ్వకాల వల్లే బాలికల మృతి
- మరికల్‌లో గ్రామస్తుల రాస్తారోకో

మరికల్: రాకొండ శివారులో ఉన్న కోయిల్‌సాగర్ ఊకచెట్టు వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయడం వల్లే ముగ్గురు బాలికలు మృత్యువాతపడ్డారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మరికల్‌లోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు బాలికలు ఈతకు వెళ్లి ఇసుక కోసం తవ్విన గుంతలో పడి మృతి చెందితే ఎమ్మెల్యేకు బాధితులను పరామర్శించే ఓపిక లేదని ప్రశ్నించారు. రాకొండలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసిన ఇసుక వ్యాపారులు, వారికి సహకరించిన పోలీసులు, రెవెన్యూ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, ఊకచెట్టు వాగులో తవ్విన గుంతలను పూడ్చివేయించాలని అన్నారు. ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు రంగంలోకి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. అనంతరం అక్కడికి చేరుకున్న తహసీల్దార్ రాంకోటి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పాథర్చేడ్‌లో విషాదఛాయలు

నర్వ: మరికల్ మండలం రాకొండలోని చెక్‌డ్యాంలో పడి సోమవారం మృతి చెందిన అక్కచెల్లెల మృతదేహాలను మంగళవారం పాథర్చేడ్‌కు తీసుకొచ్చారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన పోతురాజు గజ్జలప్పకు చెందిన ఇద్దరు కూతుర్లు శ్రావణి, మహేశ్వరీ మృతి చెందడంపై ఏ నోట విన్నా ఈ విషాదంపైనే చర్చ. ఇద్దరు కూతుర్లు వేసవి సెలవులు ఉన్నందున బంధువుల ఊరికి వెళ్లి శవాలై తిరిగిరావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు.

పెబ్బేరురూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో వీరసముద్రం చెరువులో సోమవారం బట్టలు ఉతకడానికి వెళ్లిన ముగ్గురు చిన్నారులు మృతి చెందిన విషయం విధితమే. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పగించినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లల మృతి



మక్తల్: కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన కుర్వ సురేష్ గుర్లపల్లి రోడ్డు శివారులో గొర్రెలను మేపడానికి తీసుకెళ్లాడు. గొర్రె పిల్లలను ఇనుప కంచెలో ఉంచగా, కుక్కలు దాడి చేయడంతో 25 అక్కడిక్కడే మృతి చెందాయి. దాదాపు రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పెద్దకొత్తపల్లి: వెనచర్లలో మంగళవారం సాయంత్రం మందపై ఊరకుక్కలు దాడిచేసి 20 మేకపిల్లలను చంపేసినట్లు బాధితుడు పెద్ద ఎల్లయ్య తెలిపారు. చనిపోయిన మేకపిల్లల విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: వ్యక్తి మృతి


బాలకిష్టయ్య (ఫైల్)

తెలకపల్లి: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అనంతసాగర్ చెందిన వీరమళ్ల బాలకిష్టయ్య (58) బైక్‌పై అనంతసాగర్ నుంచి మంతటికి మంగళవారం రాత్రి బయలుదేరాడు. అనంతసాగర్ గేటు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ బాలకిష్టయ్య బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల, ఇతర భాగాల మీద నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య గతంలోనే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

అడ్డాకుల: ఓ బాలికను ప్రేమ పేరుతో అత్యాచారం చేసిన ఓ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన బాలుడు(17) అత్యాచారం చేయడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మంగళవారం బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అద్దె ఇంట్లో గుప్తనిధుల తవ్వకాలు

- క్షుద్ర పూజలతో గద్వాలలో కలకలం
- పోలీసుల అదుపులో ముఠా సభ్యులు


గుప్తనిధుల కోసం తవ్విన గొయ్యి

గద్వాల క్రైం: ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న గుప్తనిధుల తవ్వకాల ముఠా సభ్యులు గుట్టుగా ఆ ఇంట్లోనే క్షుద్రపూజలు చేసి తవ్వకాలు చేపట్టారు. ముఠా సభ్యులు చేస్తున్న తతంగాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి ముఠా గుట్టును రట్టు చేసిన సంఘటన మంగళవారం గద్వాలలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గద్వాలకు చెందిన ముక్తార్, లక్ష్మణరావు, మురళి, ధరూర్‌కు చెందిన వెంకటయ్య ముఠాగా ఏర్పడి పట్టణంలోని రాఘవేంద్రకాలనీలోని రామన్‌గౌడ్‌కు చెందిన ఇంటిని కొన్ని నెలల కిందట అద్దెకు తీసుకున్నారు. అయితే నిత్యం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో పూజలు చేయగా.. సాధారణంగానే భావించారు. గత కొన్ని రోజులుగా తవ్వకాలు చేపడుతున్నట్లు శబ్దాలు రావడంతో కాలనీవాసులకు అనుమానం వచ్చి మూడు రోజులుగా ఇంటిపై నిఘా పెట్టారు. ఇంటి యజమానితో ఉన్న మరో తాళంతో తెరచి చూడగా బెడ్‌రూంలో దాదాపు 10 అడుగుల లోతులో గొయ్యి, క్షుద్రపూజాలు చేసినట్లు ఆనవాళ్లు గుర్తించారు. దీంతో వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించగా నలుగురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఈ ఘటనతో పట్టణంలో కలకలం రేగింది. ఈ విషయమై సీఐ చంద్రశేఖర్ స్పందిస్తూ గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ వందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ 16K-18K ఏజెంట్ కమీషన్ 8K. ఫోన్ : 9640258899



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రీజాయిన్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ ఖాతాల్లో ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

క్లుప్తంగా...



యాదాద్రిలో బంగారు పుష్పాల బిగింపు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పశ్చిమ పంచతల రాజ గోపురం ద్వారాలకు బంగారం పూతతో తయారు చేసిన పుష్పాలు, రేకులను అమర్చే పనులను శిల్పులు వేగంగా చేస్తున్నారు. సోమవారం రాత్రి పనులను ప్రారంభించిన శిల్పులు ఒక వైపు ద్వారాన్ని పూర్తి చేశారు. మరో వైపు పనులు మంగళవారం రాత్రి చేపట్టారు. ద్వారాలకు బంగారుపూతతో తయారు చేసిన పుష్పాలు, రేకులు బిగించడంతో నూతన కళ సంతరించుకుంది.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య వినతి

కాచిగూడ (హైదరాబాద్): బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రతినిధులు నీల వెంకటేష్, గొరిగ మల్లేష్ యాదవ్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో మంగవారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌కు వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ కులాలకు ఏ రంగంలో కూడా వాటా దక్కలేదని వివరించారు. జాతీయ బీసీ కమిషన్ జోక్యం చేసుకొని బీసీలకు అన్ని రంగాల్లో వాటా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉగ్ర ముఠాపై పంజా!

హెచ్‌యూటీ సంస్థ సానుభూతిపరుల ఇళ్లలో సోదాలు ● ఐదుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు..



అరెస్ట్ చేసిన వారిని భోపాల్ కోర్టుకు తరలిస్తున్న మధ్యప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు. (ఇన్‌సెట్లో) సలీం

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), రాష్ట్ర నిఘా వర్గాలు సంయుక్తంగా హైదరాబాద్‌లో మంగళవారం చేపట్టిన ఆపరేషన్‌లో ఐదుగురు హిజ్బా ఉత్ తహరీర్ (హెచ్‌యూటీ) సంస్థ ఉగ్రవాద అనుమానితులు చిక్కారు. ఈ మాడ్యుల్‌కు సూత్రధారిగా ఉన్న మహ్మద్ సలీం.. ఓ మెడికల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తుండగా, పట్టుబడినవారిలో ఒక దంత వైద్యుడు, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉండటం కలకలం రేపుతోంది. ఈ ఐదుగురినీ ఏటీఎస్ అధికారులు పీటీ వారెంట్‌పై భోపాల్‌కు తరలించారు. ఇదే సమయంలో మధ్యప్రదేశ్‌లోనూ ఏటీఎస్ అధికారులు మరో 11 మంది హెచ్‌యూటీ సంస్థ సభ్యులను అరెస్టు చేశారు. వారందరినీ అక్కడి కోర్టులో హాజరుపర్చగా.. ఈ నెల 19వ తేదీ వరకు వారిని ఏటీఎస్ కస్టడీకి అప్పగించింది.

■ ఐసిస్ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా..

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌కు అనుబంధంగా హెచ్‌యూటీ సంస్థ పనిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు, ఉగ్రవాదులకు సానుభూతిపరులను తయారుచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్న ఈ సంస్థ.. భారత్ సహా 50కిపైగా దేశాల్లో ఉనికిలో ఉంది. మన దేశంలో దీనిపై నిషేధం లేదు. కొంతకాలం నుంచి హెచ్‌యూటీ సంస్థ ఎక్కడికక్కడ మాడ్యూల్స్‌ను తయారు చేసుకుంటూ విస్తరిస్తోంది. తమకు ఆకర్షితులైన వారికి శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకంగా ఆర్మ్‌డ్ వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. సోషల్ మీడియాలో గ్రూపులనూ నిర్వహిస్తోంది. కేడర్‌కు ప్రమాదకర ఆయుధాల వినియోగంతోపాటు రసాయన, జీవాయుధాల (కెమికల్, బయోలాజికల్) దాడులు చేసేలా.. వీటికి సంబంధించి ఎవరికి వారు మెటీరియల్ సిద్ధం చేసుకునేలా తర్ఫీదు ఇస్తోంది.

■ మధ్యప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడ మాడ్యూల్..

భోపాల్‌కు చెందిన యాసీర్ హెచ్‌యూటీలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. తనతో కలసి చదువుకున్న సౌరభ్‌రాజ్ వైద్యను మతం మార్చుకుని, హెచ్‌యూటీలో చేరేలా ప్రోత్సహించాడు. మహ్మద్ సలీంగా పేరుమార్చుకున్న సౌరభ్.. 2019లో హైదరాబాద్‌లోని గోల్కొండ బాబాబజార్ మోతీ మహల్‌కు వలస వచ్చాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కాలేజీలో ఫార్మాస్యూటికల్ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా ఉద్యోగంలో చేరాడు. మరోవైపు కొన్నేళ్ల కింద ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన దేవీప్రసాద్ పాండ కొన్నేళ్ల క్రితమే మతం మార్చుకుని అబ్దుర్ రెహ్మాన్‌గా మారాడు. గోల్కొండలోని ధన్కోక ప్రాంతంలో నివాసం ఉంటూ.. ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇక హైదరాబాద్‌లోని హఫీజ్‌బాబా నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బస్క వేణుకుమార్ కూడా కొన్నేళ్ల క్రితం మతం మార్చుకుని మహ్మద్ అబ్బాస్ అలీగా మారాడు.

సలీం ఈ ఇద్దరితోపాటు గోల్కొండ బడాబజార్‌కు చెందిన దంత వైద్యుడు షేక్ జునైద్, జగద్గిరిగుట్ట మగ్దూంనగర్‌కు చెందిన మహ్మద్ హమీద్, జవహర్‌నగర్‌లోని శివాజీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌లను ఆకర్షించాడు. తనతో సహా ఆరుగురితో హెచ్‌యూటీ మాడ్యూల్‌ను ఏర్పాటు చేశాడు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో యాసీర్ నేతృత్వంలో 11 మంది మరో మాడ్యూల్ కార్యకలాపాలు ప్రారంభించింది.

■ మూడు నెలల పాటు నిఘా పెట్టి..

యాసీర్, సలీంల మాడ్యూల్స్ ఉగ్రవాద దాడులకు సిద్ధమవుతున్న విషయంపై మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులకు మూడు నెలల క్రితం జాతీ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. అప్పటి నుంచి తెలంగాణ నిఘా వర్గాల సాయంతో ఏటీఎస్ అధికారులు వీరిపై కన్నేసి ఉంచారు. అన్ని అంశాలను నిర్ధారించుకుని.. మంగళవారం తెల్లవారుజామున అటు భోపాల్‌లో, ఇటు హైదరాబాద్‌లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. భోపాల్‌లో 11 మంది పట్టుబడగా.. హైదరాబాద్‌కు చెందిన మాడ్యూల్‌లో మహ్మద్ సల్మాన్ మినహా ఐదుగురిని పట్టుకున్నారు. మహ్మద్ సలీం ఇంటి నుంచి రెండు ఎయిర్‌గన్‌లు, పిల్లెట్స్, కత్తులు, గొడ్డళ్లతోపాటు ఉగ్రవాద సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐదుగురిని పీటీ వారెంట్‌పై భోపాల్‌కు తరలించారు. పరారీలో ఉన్న మహ్మద్ సల్మాన్ కోసం రాష్ట్ర పోలీసులు గాలిస్తున్నారు.

అనంతగిరి అడవుల్లో క్యాంప్.. హైదరాబాద్‌లో రెక్కీ..

యాసీర్, సలీంల నేతృత్వంలోని 17 మంది ప్రత్యేకంగా రాకెట్ చాట్ యాప్ ద్వారా సంప్రదింపులు జరిపారు. తుపాకులు, కత్తులు, గొడ్డళ్లను వినియోగించి ఎవరికి వారుగా 'లోన్ వూల్ఫ్ ఎటాక్స్ (ఒంటరిగానే ఎవరిపైనైనా దాడిచేసి కలకలం రేపడం)'చేయాలని.. అవసరమైనప్పుడు బాంబులు తయారు చేసి జనసమ్మర్ధ ప్రాంతాల్లో విరుచుకుపడాలన్నది వీరి పథకం. ఇందుకోసం అఫ్గానిస్తాన్‌లో అమెరికా బలగాలతో పోరాడిన ఐసిస్ మాడ్యుల్స్‌ను ఆదర్శంగా తీసుకున్నారు. రెండు మాడ్యూల్స్‌కు చెందిన 17 మంది కొన్నినెలల కింద వికారాబాద్ అనంతగిరి అడవుల్లో క్యాంపు నిర్వహించారు. ఎవరిని టార్గెట్‌గా ఎంచుకోవాలి? ఏ విధంగా దాడులకు దిగాలనేది చర్చించుకున్నారు. తర్వాత హైదరాబాద్ నగరంలో రెక్కీ చేశారు. పలు కీలక ప్రాంతాల్లో డ్రోన్లతోనూ రెక్కీ చేసి.. దాడులకు సన్నాహాలు చేసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా సంప్రదింపుల్లో ఉంటూ దాడులకు మెటీరియల్‌ను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు.

■ నిషేధం విధించేలా..

హెచ్‌యూటీ సంస్థపై 2021లో తమిళనాడులో ఓ కేసు నమోదైంది. దాన్ని దర్యాప్తు చేసిన 'నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)'గతేడాది అభియోగపత్రాలు దాఖలు చేసినట్టు అధికారులు తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ సంస్థపై నిషేధం విధించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్టు వెల్లడించారు.

ఐసిస్ కన్నా ప్రమాదకరంగా హెచ్‌యూటీ!

ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు అనుబంధంగా హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) సంస్థ పనిచేస్తున్నట్టు ప్రచారమున్నా.. దాని మూలాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. 1952లో ఇజ్రాయెల్‌లోని జేరుసలేంలో స్థాపితమైన ఈ సంస్థ.. ప్రస్తుతం లండన్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. యూరప్‌తోపాటు ఆసియాలోని ముస్లిం ప్రభావిత దేశాలకు విస్తరించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండోనేషియాలో దీని ఉనికి ఎక్కువ. నేరుగా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడకపోవడంతో చాలా దేశాల్లో దీనిపై నిషేధమేదీ లేదు. అయితే ఐసిస్ ఉగ్రవాద సంస్థ పతనం అనంతరం ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు హెచ్‌యూటీ ప్రయత్నిస్తున్నట్టు అంతర్జాతీయ నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ సంస్థ ఐసిస్ కన్నా ప్రమాదకరంగా మారుతోందని.. రసాయన, జీవాయుధాల వినియోగంపై కేడర్‌కు శిక్షణ ఇస్తోందని హెచ్చరించాయి. భారత్‌లో హెచ్‌యూటీ కార్యకలాపాల విస్తరణపై అంతర్జాతీయ భద్రతా సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిందని సమాచారం. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా నిఘా పెట్టినట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి.



కె.పూజ

విజయ్‌రాయ్

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులతో ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విజయకేతనం

హన్మకొండ చౌరస్తా: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు. సెకండియర్‌లో కె.పూజ 994 సాధించగా, ఐదుగురు విద్యార్థులు 993 సాధించారని వరదారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బైపీసీ సెకండియర్‌లో విజయ్‌రాయ్ 992, వర్ష 991, మరో నలుగురు 990 మార్కులు సాధించారని తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 10 మంది విద్యార్థులు 467, 45 మంది 466 సాధించారని తెలిపారు. బైపీసీలో 440 మార్కులకు ఐదుగురు విద్యార్థులు 436 మార్కులు సాధించినట్లు చెప్పారు.



టాపర్స్‌తో ట్రినిటీ కళాశాల విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, అధ్యాపకులు

ఇంటర్ ఫలితాల్లో 'ట్రినిటీ' ప్రభంజనం

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కరీంనగర్‌లో ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్వితీయ ప్రతిభ కనబరిచారు. సెకండియర్ ఎంపీసీలో కె.నిఖిత, ఎం.మానస 990 మార్కులు, ఇద్దరు విద్యార్థులు 989, ఇద్దరు 988, ఇద్దరు 987 మార్కులు సాధించారు. బైపీసీలో చంద్రశేఖర్ 989 మార్కులు, ఐదుగురు విద్యార్థులు 988, ఇద్దరు 985, ఎంఈసీలో ఆర్.సాత్విక 986 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో వి.ఆశ్రిత, ఎం.శ్రావ్య 467, ఆరుగురు విద్యార్థులు 466 మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్.గంగశ్రీ 436 మార్కులు, కె.రాణి 435, రిదా హర్షణ్ 434 మార్కులు సాధించారు. ఎంఈసీలో కె.పూజ 470, సీఈసీలో డి.వర్షిణి 489 మార్కులు సాధించారు.



టాపర్స్‌తో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

సత్తాచాటిన 'ఆల్ఫోర్స్'

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులను ఆల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. సెకండియర్ ఎంపీసీలో ఎస్.హర్షిత, ఎస్.ఉజ్వల్, ఎస్.హరిణి, జి.వినీత, కె.రాజశేఖర్ 992 మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్.నిహారిక 992 మార్కులు సాధించారు. ఎంఈసీలో సి.హెచ్.మనీషా, జి.అమూల్య 988 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో పది మంది విద్యార్థులు 467 మార్కులు, బైపీసీలో ఏ.శ్రీనిధి 437, ముగ్గురు 436 మార్కులు, ఎంఈసీలో ఎం.వినమ్రత 488 మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో 'ప్రతిభ' విజయ దుందుభీ



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ప్రతిభ కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని ప్రతిభ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజయ దుందుభీ మోగించారు. బైపీసీ రెండో సంవత్సరం విద్యార్థిని శ్రుతి 992 మార్కులు, ఎంపీసీ రెండో సంవత్సరంలో జాహ్నవి 991 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటారు. ఎంపీసీ రెండో సంవత్సరంలో 31 మందికి 980 మార్కులు, బైపీసీలో 2వ సంవత్సరంలో 12 మంది 980కిపైగా మార్కులు సాధించారు. కాగా మొదటి సంవత్సరం ఎంపీసీలో చరణ్‌లాల్ 466, సాత్విక 466, హర్షిత 465, అన్వరుద్దీన్ 465, బైపీసీ మొదటి సంవత్సరంలో అవాంజిలిన్ 435, సౌందర్య 435 మార్కులు సాధించారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులను కళాశాల గౌరవ సలహాదారు మంజులాదేవి, లక్ష్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, విష్ణుజనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.

'రిషి' విజయకేతనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో రిషి యాజమాన్యం, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. బైపీసీ రెండో సంవత్సరం విద్యార్థిని 988 మార్కులు, ప్రణీత భ్రమరాంబిక 987, నౌషీన్ సుల్తానా 987, ఎంపీసీ రెండో సంవత్సరంలో మైత్రి 983, శ్రీనివాస్ 982, కౌశిక్ యాదవ్ 980, ఎంపీసీ మొదటి సంవత్సరంలో అమూల్య 467, దివ్యయశోద 467, ధరణి 466 మార్కులు, బైపీసీ విభాగంలో అనన్య 437, ఆయేషా సుమయ్య 435, స్నేహప్రియ 435 మార్కులు సాధించారు. ఈ మేరకు విద్యార్థులను కళాశాల యాజమాన్యం పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సలహాదారు వెంకటయ్య, చైర్‌పర్సన్ చంద్రకళావెంకట్, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన 'వాగ్దేవి'



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభచాటారు. ఎంపీసీ విద్యార్థిని అంకిత 992 మార్కులు సాధించింది. బైపీసీలో సానియా 989 మార్కులు, అనుష్క 989, భాగ్యలక్ష్మి 988 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీలో నవ్యశ్రీ 436 మార్కులు, ఎంపీసీ విభాగంలో ముస్తఫాఅలీ 464 మార్కులు వచ్చాయి. ఈ మేరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, ఇన్‌చార్జ్ పావని, శివకుమార్, రాఘవేందర్‌రావు, నాగేందర్, మేఘ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థులు బలవన్మరణం

– ఫెయిల్ కావడంతో అఘాయిత్యం

గద్వాల క్రైం: ఇంటర్ ఫెయిలైన ఓ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గద్వాలలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి, కల్పనల రెండో కుమారుడు అమరేశ్వరెడ్డి(17) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. అయితే మంగళవారం వెలువడిన ఫలితాల్లో మ్యాథ్స్–ఏలో ఫెయిల్ అయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. బయటికి వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసి వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్వగ్రామం గద్వాల మండలంలోని పూటాన్‌పల్లి కాగా.. పిల్లల చదువుల కోసం గద్వాలకు వచ్చి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపారు.

మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని..

కొత్తకోట: ఇంటర్ పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని మనస్తాపంతో నవీన (17) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. నారాయణపేట జిల్లాకు చెందిన నవీన కుటుంబం పట్టణంలో స్థిరపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో తనకు తక్కువగా మార్కులు వచ్చాయని కలత చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

'అక్షర' ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న అక్షర కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు బైపీసీలో అస్మ బరీన్ 435 మార్కులు, అమేనా తయ్యబ 431 మార్కులతో ప్రభంజనం సృష్టించారు. మరో 12 మంది విద్యార్థులు 400లకుపైగా మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో సూహరిత్ భరద్వాజ 464 మార్కులు, చందన 462, అమృత 461, నేహ 461 మార్కులు వచ్చాయి. మరో 12 మంది విద్యార్థులు 450కిపైగా మార్కులు సాధించారు. ఈ మేరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఫణిప్రసాద్, ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముందంజలో 'శ్రద్ధ'



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని శ్రద్ధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ముందంజలో నిలిచారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో సుమయ్య అర్షన్ 467 మార్కులు, బైపీసీలో నిమ్రా అంజుమ్ 435, రెండో సంవత్సరం ఎంపీసీ విభాగంలో దివ్య, శృతికీర్తి 982 మార్కులు సాధించారు. బైపీసీ రెండో సంవత్సరంలో అర్చన 976, ఎంఈసీ, సీఈసీలో రూబీ ముస్కాన్ 981, శౌసాయి సుల్తాన్ 981 మార్కులు వచ్చాయి. ఈ మేరకు మార్కులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జగపతిరావు, యాజమాన్యం మధుమోహన్, తిరుపతిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత పాలమూరులో భారీ చోరీ



బాధితుడితో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కె.నరసింహ

- 13 తులాల బంగారం, రూ.3.10 లక్షల నగదు అపహరణ
- పరిశీలించిన ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దొంగలు తాళాలు పగులకొట్టి చోరీ చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ రామకృష్ణ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని పాత పాలమూరుకు చెందిన శ్రీనివాసులు ప్రభుత్వ ఉద్యోగి. అయితే ఈ నెల 8న ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో బంధువుల ఫంక్షన్ ఉండటంతో వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటి పక్కనే ఉన్నవారు శ్రీనివాసులుకు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరుచుకుని ఉన్నాయని చెప్పడంతో ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. గేట్ తాళంతోపాటు ఇంటి తాళం పగులకొట్టి దొంగలు లోపలికి ప్రవేశించి ఇంట్లో ఉన్న దాదాపు 13 తులాల బంగారం, రూ.3.10 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం దొంగతనం జరిగిన ఇంటిని ఎస్పీ కె.నరసింహ, డీఎస్పీ టి.మహేష్ పరిశీలించారు. చోరీ చేసిన తీరు పరిశీలించడంతోపాటు బాధితుడితో వివరాలు సేకరించారు. వెంటనే విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులను ఆదేశించారు.

శ్రీశైలంలో నీటిమట్టం 808.2 అడుగులు

దోమలపెంట(అచ్చంపేట): శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 808.2 అడుగులు, 33.2957 టీఎంసీలు నిల్వ ఉంది. రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల చేయలేదు. జలాశయంలో 126 క్యూసెక్కుల నీరు ఆవిరైంది. నీటి క్యాచ్‌మెంట్ వలన 1,754 క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరాయి.


తాగునీటి కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తి నీటిమట్టం 1,020అడుగుల వరకు చేరింది. జూరాల ఎడమకాల్వ సమాంతర కాల్వ వచ్చేకు నీటిని, రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వ నీటిని నిలిపేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో మరింత తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి కేవలం 1,165 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, రాత్రి 7గంటల వరకు ప్రాజెక్టులో 6.019 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 112 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు.

సత్తాచాటిన 'జలజం'



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం రమేష్‌గౌడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని జలజం జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాల సాధించారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు ఎంఈసీ ద్వితీయ సంవత్సరంలో పర్వీన్ 986 మార్కులు, సీఈసీలో వర్షిణి 973 మార్కులు, ఎంఈసీ మొదటి సంవత్సరంలో సోనాల్ కంకణి 490 మార్కులు, సీఈసీలో విజయ్‌కుమార్ 473 మార్కులు సాధించారు. ఈ మేరకు మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం రమేష్‌గౌడ్ ఘనంగా సన్మానించారు.